
వేంపల్లి గంగాధర్



# శతమానం భవతి

పండక్కి తెచ్చిన పట్టు పావడా కట్టుకొని తలలో మూరెడు సన్న జాజులు నింపుకొని, గజ్జెల సవ్వడి చేసుకుంటూ అమ్మమ్మ పాదాలకు నమస్కరిస్తున్నప్పుడు, ఆవిడ ప్రేమగా అక్షింతలు చల్లుతూ 'శతమానం భవతి...'అని దీవించింది. తర్వాత అమ్మ కాళ్ళకు వందనం చేస్తున్నప్పుడు యాదృచ్ఛికంగా అమ్మ కూడా 'శతమానం భవతి...'అని దీవించడం నాకిప్పటికీ గుర్తు. వాళ్ళు ఎందుకలా దీవించారో నా పధ్నాలుగేళ్ళ ప్రాయానికి అప్పటికి అర్థంకాలేదు కానీ... తర్వాత్తర్వాత...!

★ ★ ★

పదవ తరగతికి వెళ్ళగానే నా శరీరంలో వచ్చిన మార్పులు నన్నెందుకో కొత్త దశలోకి చేర్చినట్లు అయ్యింది. అంతవరకు ఎలా కాలం గడిపానో తెలియదు కానీ... 'కొత్త బంగారు లోకం నాకు కావాలి సొంతం, గాలి పాడాలి ఈ దినం. పుడమి కావాలి స్వర్గం' అనుకుంటూ మనసులోని భావాల్ని బయట పడనీకుండా, లోలోపలే దాచుకుంటూ అప్పుడప్పుడూ నాలో నేనే నవ్వుకుంటూ గడిపేదాన్ని.

ఇలా... ఇలా...కాలం గడుస్తుండగా ఓసారి క్లాసులో నేను లేనప్పుడు నా పుస్తకాల్లో ఎవరో ఏదో కాగితం పెట్టారు. తీసి చదివాను. అదొక ప్రేమలేఖ. నా అందాల్ని పొగుడుతూ నేనంటే ఇష్టపడుతూ... 'నా గుండెలోనే వుండిపోవా... నీ కోసమే నా అన్వేషణ... నీ ధ్యానమే నా ఆలాపన' అంటూ ప్రేమ గీతాల హోరుతో రెండు పేజీలు నిండి వున్న ప్రేమ లేఖ.

నాకు అందిన మొట్టమొదటి ప్రేమలేఖ.

ఏం చెయ్యాలో అర్థంకాలేదు. దాన్ని పుస్తకంలోనే నెమలి కన్నులా దాచుకోవాలని మనసులో ఉన్నప్పటికీ బయటకు మాత్రం కన్పించకుండా ముక్కలుగా చింపి పారేయాల్సి వచ్చింది. రెండోరోజు మరో ప్రేమలేఖ నా పుస్తకాల పేజీల మధ్య ప్రత్యక్షమయ్యింది. తీసి చదివాను. ఇంకొకడు ఎవడో రాశాడు. నన్ను పువ్వులతో పోల్చాడు. స్వప్నసుందరివి అన్నాడు. పదాలు కూడా సరిగ్గా రాయడం చేతకానివాడు ప్రేమ గురించి రాస్తే ఇలాగే వుంటుందా... అనిపించింది. అదికూడా ముక్కలైంది. నా పుట్టినరోజునాడు కొత్త బట్టలు కట్టుకొని, అందంగా ముస్తాబై, అమ్మ కాళ్ళకి, అమ్మమ్మ కాళ్ళకి వందనం చేసినప్పుడు ఎప్పటిలాగానే వాళ్ళు 'శతమానం భవతి...'' అని ఆశీర్వదించడం గుర్తుంది.

వాళ్ళు ఎందుకలా దీవించారో నా పదిహేనేళ్ళ ప్రాయానికి అర్థంకాలేదు కానీ... తర్వాత్తర్వాత...!

★ ★ ★

ఇంటర్లో చేరాను. కాలేజీ జీవితం మొదలయ్యింది. రంగురంగుల ప్రపంచంలోకి చిలుకలా అడుగుపెట్టాను. అంతా కొత్త వాతావరణం. కొత్త స్నేహితులు. ప్రతివాడూ 'నువ్వంటే నాకిష్టం' అనేవాడే. కాదంటే '1,4,3' అనే మరో ఫార్ములా. I LOVE YOU అని దాని అర్థమట. అదో రకమైన ఆట. నాకేమో మంట.

నిదానంగా 'సినిమాకు వెళ్దాం వస్తావా?'అని అడిగేవాళ్ళు కొందరు తయారయ్యారు. చూసిన ప్రతివాడూ చిరునవ్వు నవ్వుతూ కళ్ళు ఎగరేయడం మామూలైంది. దసరా పండుగ రోజు అమ్మవారి ఆలయానికి అమ్మతో కలిసి వెళ్ళాను.

గుడిలోనూ కొందరు నావైపు అదోలా చూడడం కన్పించింది. ప్రదక్షణలు చేస్తున్నప్పుడు అంతవరకు లేనిది పదిమంది అబ్బాయిలు నా వెనుక తిరగడం... ప్రదక్షణల పాట్లు పడటం... మనశ్శాంతికోసం గుడికెళ్తే అక్కడ కూడా ఇలాంటివి ఏమిటో అర్థంకాలేదు.

అమ్మాయి కనిపిస్తేచాలు కామెంట్ చేసే పోకిరి రాయుళ్ళ ఆగడాలు భరించాల్సి వచ్చింది. 'దాచేస్తే దాగునా అది...దోచేస్తే దొరుకునా ఇది...' అంటూ పాటలందుకోవడం, వెకిలి నవ్వులు నవ్వడం, వెనుకవైపు ఫాలో అవడం, 'ముందువైపునుంచి చూస్తే విజయశాంతి, వెనుక వైపునుంచి చూస్తే డిస్కోశాంతి'అంటూ కామెంట్ చేయడం, ఒంటరిగా బయటకు వెళితే చాలు వేధింపులకుగురై బాధపడాల్సి వచ్చేది.

అమ్మకు చెబుదాం అంటే నాకష్టం తనకి చెప్పి బాధపెట్టడం ఎందుకని మౌనంగానే వుండిపోయేదాన్ని. చుట్టూ వున్న మగవాళ్ళ ప్రపంచం వొక పద్మవ్యూహంలా అనిపించేది.

నా పదహారేళ్ళ జన్మదినంరోజు ఎప్పటిలాగానే పెద్దలు 'శతమానం భవతి' అని దీవించినప్పుడు వాళ్ళు ఎందుకలా దీవించారో ఆలోచించాల్సిన విషయమేనని అర్థమయ్యింది.

★ ★ ★

ఇంటర్ రెండో సంవత్సరం. ఇంటి పక్కనున్న అంకుల్ వాళ్ళింటికి వెళ్ళాలంటే భయంవేసేది. ఆంటీకోసం వెళ్ళినప్పుడు అంకుల్ నావైపు కన్నులార్పకుండా చూసే దృశ్యం గుర్తుకొస్తోంది. పాపం... ఆంటీ చాలా మంచిది. అమాయకంగా తన భర్త శ్రీరామ చంద్రుడంటూ పొగిడేస్తూ అయ్యగారి నీతిచరిత్ర అంతా ఘట్టాలు చొప్పున చెప్పుకొచ్చేది.

ఆంటీని చూస్తే జాలిపడాలో, బాధపడాలో తెలిసేది కాదు. పక్కింటికి వెళ్ళడం బాగా తగ్గించాను.

కాలేజీకి సైకిల్లో వెళ్తున్నప్పుడు ప్రతిరోజూ గుండుగాడొకడు స్కూటర్లో అదేపనిగా ఫాలో అయ్యేవాడు. ఒకరోజు వాడు చూస్తుండగానే చెప్పు తీసి సవరించుకొని మళ్ళీ తొడుక్కోవడంతో తలవంచుకొని వెళ్ళిపోయాడు. ఇంకెప్పుడూ వాడు కన్పించలేదు. ఇలా వెంటపడే రోగం ఏమిటో అనిపించేది.

అమ్మ సరుకులకోసం అంగడికి పంపినప్పుడు బజార్లో అల్లరిమూక నన్ను చూసి ఏవేవో సిగ్గులేని మాటలు అంటున్నప్పుడు పట్టించుకోకుండా ముందుకు వెళ్ళిపోయేదాన్ని. మరి కొందరైతే రద్దీ కూడళ్ళలో ఏదో పనిమీద వచ్చినట్లు దారిప్రక్కనే నిలబడి బాతాఖానీ చేస్తూ వెకిలిగా కామెంట్ చేసేవాళ్ళు.

'అమ్మాయి హెయిర్‌పిన్ చూడరా ఎలా మెరుస్తుందో...'

అని ఒకడంటే, 'అదేం...చూస్తావ్ గురూ! గుచ్చిన గులాబీ చూడు. దానికింద జలపాతంలా జాలువారిన జడ చూడు...'అని మరొకడు, 'ఆ ముఖానికి రుద్దిన పాండ్స్ చూడు, ఆ కళ్ళకు దిద్దిన ఐటెక్స్ చూడు, మెడలోని బంగారు చైన్ చూడు...'అని ఇంకొకడు రాగంతీస్తే-

'మనిషంతా నిలువెత్తు బంగారం రా... ఆ మెరిసే బంగారం దానిముందెంత... 'అని పక్కనున్నవాడు నోటి కొచ్చినట్లు అనేవాళ్ళు.

ఇలాంటి విసుర్లు అలా విని, ఇలా వదిలేసేదాన్ని. కాలం కదులుతూనే వుంది వేగంగా... నా ప్రాయంగా... అపాయంగా... అమ్మ, అమ్మమ్మ ఎప్పటిలాగానే దీవించారు నా పదిహేడేళ్ళ బర్త్‌డే రోజు 'శతమానం భవతి'అంటూ ఆ మాట వెనుకవున్న పరమార్థం ఏమిటో అంతుచిక్కని స్థితిలోనే వుంది.

★ ★ ★

డిగ్రీలోకి ప్రవేశించాను. డిగ్రీల చొప్పున పడుచు ప్రాయం వేగం పెరుగుతూనే వుంది. బస్సుకోసం బస్టాండులో ప్రతిరోజూ నిల్చోవాల్సిందే. ఎంత విసుగునైనా భరించవచ్చుగానీ మగవాళ్ళ విసుర్లను సహించలేక పోయేదాన్ని.

చూడు గురూ... ఆ అమ్మాయి ఎప్పుడూ 36 24 36 నెంబరు బస్సు కోసమే చూస్తుంది. వేరే బస్సు ఏది వచ్చినా ఎక్కదు. కారణం ఏమిటో తెలుసా?' అని అడిగాడు ప్రక్కనున్న వాడ్ని.

వాడు తెలియదన్నట్లు ముఖం పెట్టాడు.

'అది కూడా తెలియదా... అవి ఆ అమ్మాయి కొలతల అంకెలు బ్రదర్. అందుకే ఆ అమ్మాయి ఆ బస్సే ఎక్కుతుంది'' అంటూ వాడే జవాబిచ్చాడు.

మరుసటిరోజునుంచి నేను ఆ నెంబర్ బస్సు ఎక్కడం మానేశాను.

డిగ్రీ మూడు సంవత్సరాల కాలంలో మరింత సంఘర్షణను అనుభవించాను. సాటి స్నేహితురాళ్ళు ఉదయం తొమ్మిది కాగానే బైక్ తీసుకొని వీధి మలుపులో వెయిట్ చేసే తన ప్రేమికుడి వెనుక అందంగా కూర్చొని నవ్వుతూ వెళ్ళిపోవడం చూశాను.

సినిమాలకు, పార్టీలకు, పిక్నిక్‌లకు కలిసి తిరగడం చూశాను. సహజమైన ఆకర్షణలో వాళ్ళేం చేస్తున్నారో వాళ్ళకే అర్థంకాని స్థితిలో కాలుజారి కడుపుల్ని తెచ్చుకొని, తీయించుకున్న సంఘటనలు చూశాను.

మోసంచేసిన వాడు మరొక అమ్మాయితో మళ్ళీ స్వేచ్ఛగా తిరగడమూ చూశాను. సిటీ బస్సుల్లో వెళ్తున్నప్పుడు రద్దీని ఆసరాగా చేసుకొని చేతులు, కాళ్లు తగిలించేవాళ్ళు, అదేపనిగా శరీరాన్ని ఆనించి, స్పీడ్ బ్రేకర్ల దగ్గర కావాలనే మీద పడుతూ... వెకిలి చేష్టలు చేసే పోకిరీగాళ్ళనూ చూశాను. ఎలాగోలా ఫోన్ నంబర్ సంపాదించి వేధించే పురుష పుంగవుల్ని చూశాను.

అప్పుడర్థమయ్యింది కొంతలో కొంత భాగంగా 'శతమానం భవతి...' అంటే అర్థమేమిటో...!

★ ★ ★

నా స్నేహితురాలు అర్చన కోరిక మేరకు వాళ్ళ కంపెనీలో ఏదో ఉద్యోగం ఖాళీగా వుందంటే అప్లికేషన్ ఇచ్చాను. ఇంటర్వ్యూకి పిలిచాను. వెళ్ళాను. బాస్ సీట్లో ముప్పైఅయిదు సంవత్సరాల వ్యక్తి ఒక్కడే కూర్చొని వున్నాడు. ఇంటర్వ్యూ మొదలైంది. కొన్ని ప్రశ్నలైన తర్వాత సరదాగా కొన్ని ప్రశ్నలడగమంటారా? అని



**సమాజంలో అడుగడుగునా మగవాళ్ళు వేసే వలలు, తీసే గోతులనుంచి తననుతాను ఎలా రక్షించుకోవాలో, ఎలా ఎదుర్కోవాలో, బతకడానికి కావాల్సిన బాధ్యతను, భరోసాను 'శతమానం' భవతి...' చెప్తుంది.**

ఆయన అన్నారు.

'సరే'అన్నట్లు తల ఊపాను.

'వాత్సాయన కామసూత్రాల్లో భంగిమలెన్నో' తెలుసా? అడిగారు ఆయన.

నాకు అర్థం అయింది... ఆయనగారి క్యారెక్టర్ ఏమిటో. మౌనంగా వుండిపోయాను.

'పోనీ... మరో ప్రశ్న దీనికైనా సమాధానం చెప్పండి... క్లింటన్- మోనికా లూయిస్కీల వ్యవహారంపై మీ అభిప్రాయం ఏమిటి?' అడిగారు.

ఏం చెప్పాలో అర్థంకాలేదు.

'ఈ ప్రశ్నకు సమాధానం చెబితే మీకు ఉద్యోగం ఇచ్చేది...లేనిది చెబుతాను' మళ్ళీ ఆయనే అన్నాడు.

నిశ్శబ్దంగానే వుండిపోయాను. మోనికా చేసింది తప్పు... అని మీరంటే చాలు నెలకు పదివేల జీతం... కారు... హుందాగా బతకడానికి కావల్సిన అన్ని వసతులూ నేను ఏర్పాటుచేస్తాను. మీరు ఒప్పుకుంటే చాలు... రేపు ఉదయమే మీ ఇంటిముందు ఆగుతాయి. మీ అప్లికేషన్‌లో చూశాను రేపు మీ బర్త్‌డే. కొత్త జీవితాన్ని ఇస్తాను.'' కొన మీసం కొరుకుతూ ఓరగా చూస్తూ అన్నాడు.

విసుగ్గా లేచి అక్కడినుంచి త్వరత్వరగా బయటకు వచ్చేశాను.

★ ★ ★

ఉదయమే తలంటి స్నానంచేసి, కొత్త బట్టలు కట్టుకొని, తలలో మూరెడు సన్నజాజులు నింపుకొని, నుదుటన తిలకం దిద్దుకొని, కళ్ళకు కాటుక పెట్టుకొని, అందాన్నంతా సింగారించుకుని గజ్జెల సవ్వడి చేసుకుంటూ అమ్మమ్మ పాదాలకు నమస్కరిస్తున్నప్పుడు ఆవిడ ప్రేమగా అక్షింతలు చల్లుతూ 'దీర్ఘాయుష్మాన్ భవ'అని దీవించింది.

తర్వాత అమ్మ కాళ్ళకి వందనం చేస్తున్నప్పుడు అమ్మ కూడా 'దీర్ఘాయుష్మాన్ భవ'అని దీవించడం కొత్తగా అనిపించింది.

దీవెనలో ఎందుకు మార్పు వచ్చిందో అర్థంకాలేదు. ఆలోచించాను.

'శతమానం భవతి...'అంటే ఏమిటో దాని అర్థం, పరమార్థం ఎలా మారిపోతుందో అర్థమైంది. నిండు నూరేళ్ళు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో జీవించమంటూ దీవించే దీవెన నిండునూరేళ్ళు ఆడవాళ్ళు తమ మానాల్ని మగవాళ్ళు బారినుంచి ఎలా కాపాడుకోవాలో నేర్పిస్తుంది.

సమాజంలో అడుగడుగునా మగవాళ్ళు వేసే వలలు, తీసే గోతులనుంచి తననుతాను ఎలా రక్షించుకోవాలో, ఎలా ఎదుర్కోవాలో, బతకడానికి కావాల్సిన బాధ్యతను, భరోసాను 'శత మానం' భవతి...' చెప్తుంది. గుర్తుచేస్తుంది.

'అమ్మా... నన్నెప్పుడూ దీవించేటట్లు' 'శత'మానం భవతి...' అని దయవుంచి దీవించు... ' అని పాదాలమీద పడ్డాను.

అమ్మ అయోమయంగా చూస్తోంది.

అమ్మదగ్గర, అమ్మమ్మ దగ్గర ఆశీస్సులు తీసుకున్నాను. ఏదో ఆత్మవిశ్వాసం మనసంతా నిండిపోయింది.

నేను ఇంటర్వ్యూలో సెలక్ట్ అయినట్లు కంపెనీ నుంచి వచ్చిన టెలిగ్రాంను ముక్కలుచేసి చీకటి గది గోడలను దాటుకుంటూ వెలుతురు వాకిలి దగ్గరున్న చెత్త బుట్టలో వేయడానికి నడక ప్రారంభించాను. ★

